శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త



## తిరుమల కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని

### దర్శించుకున్న పలువురు ప్రముఖులు



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – వైద్యం :** తిరుమల కలియుగ దైవం అయిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని నెల్లూరు పార్లమెంటరీ టీడీపీ అధ్యక్షులు, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర , జోనల్ కోఆర్డినేటర్, రాష్ట్ర మ్యారీ టైం బోర్డు చైర్మన్ దామంచర్ల సత్య, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. వారితోపాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కూడా శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు.

## కండలేరులో 36.440 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 11, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయానికి 36.440 టీయంసీల నీటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. జళాశయం నుండి లో లెవల్ స్లూయిస్ ద్వారా 50 క్యూసెక్కులు హై లెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కులు, కండలేరు హెడ్ రెగ్యులేటం ద్వారా 1280 క్యూసెక్కులు, హెడ్ రెగ్యులేటర్ పవర్ హౌస్ ద్వారా 715 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## రొట్టెల పండుగ ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

- రొట్టెల పండుగ ఏర్పాట్లపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజీజ్ ముమ్మర కసరత్తు
- నెల్లూరు బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగకు 10 కోట్లు - జూన్ 24 లోగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం
- ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు నెల్లూరు రోటీ ఫెస్టివల్ - దర్గా వద్ద అధికారులతో సమీక్ష
- గత ప్రభుత్వంలో నిర్వహణ అట్టర్ ఫ్లాప్ - ఈసారి రొట్టెల పండుగను అంగరంగ వైభవంగా జరిపిస్తాం - మంత్రి నారాయణ



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – వైద్యం** 415 సంవత్సరాల చారిత్రక ప్రాశస్తం కలిగి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన బారాషాహిద్ దర్గా రొట్టెల పండుగ ఏర్పాట్లను నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు డాక్టర్ పొంగూరు నారాయణ పరిశీలించారు. అనంతరం దర్గా ప్రాంగణంలో మంత్రి ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు జరగనున్న ఈ రోటీ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, దర్గా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు, మున్సిపల్ కార్పొరేషన్ నిధులతో కలిపి మొత్తం 10 కోట్లతో పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ ఆధ్వర్యంలో డిజైన్లు ఫైనలైజ్ అయి, ఇప్పటికే టెండర్లు కూడా పూర్తయిన పనులను అత్యంత నాణ్యతతో, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రొట్టెల పండుగకు 2014లో 4 లక్షలుగా ఉన్న భక్తుల సంఖ్య 2019 నాటికి 14 లక్షలకు చేరిందన్నారు. రొట్టెల పండుగను ఈ ఏడాది అంగరంగ వైభవంగా జరిపిస్తామని మంత్రి తెలిపారు. జూన్ 24వ తేదీలోపు ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని డెడ్‌లైన్ విధించారు. ఎక్కడా తాగునీటి కొరత రాకుండా చూడాలని, మొబైల్ టాయిలెట్లతో పాటు శౌచాలయాలను నిరంతరం శుభ్రం చేస్తూ శానిటేషన్ పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ముఖ్యంగా పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్ల వద్ద నాచు, పురుగులు లేకుండా తెల్లటి బట్టలతో క్లీన్ చేసే విధానాన్ని కొనసాగించాలని, మహిళలకు, పురుషులకు విడివిడిగా స్నానాల గదులు, కొళాయిలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో నగర మేయర్ సుజాతా అశోక్, కార్పొరేషన్ కమిషనర్ నందన్, ఏఎస్పీ దీక్ష, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ మరియు వివిధ శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

## స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి

### ఛాంపియన్ రైతులు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి

- సమగ్ర వ్యవసాయం భవిష్యత్తు తరాల ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరం
- వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధికే కాకుండా వ్యాపార దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలి
- భూమి సారవంతం కోసం రసాయనాల వినియోగాన్ని తగ్గించాలి - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల






**నెల్లూరు–అగ్రికల్చర్, జూన్ 11, ప్రభాతవార్త** ఛాంపియన్ రైతులు వ్యవసాయ ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు జిల్లాలో బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. నెల్లూరు ఆకుతోట వద్దనున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఛాంపియన్ రైతుల కిసాన్ గోష్టి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హాజరై రైతులతో ముఖాముఖి మాట్లాడారు . నెల్లూరు, సర్వేపల్లి కోవూరు నియోజకవర్గాలకు చెందిన సుమారు 300 మంది ఛాంపియన్ ఫార్మర్స్ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు ఛాంపియన్ రైతులు తమ అనుభవాలను , ఆధునిక సాగు విధానాలను సహజ వ్యవసాయ పద్ధతులను కలెక్టర్ సమక్షంలో వివరించారు. రైతులతో కలెక్టర్ స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు అభిప్రాయాలు తెలుసుకొని సూచనలు ఇవ్వడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా హిమాన్షు శుక్ల మాట్లాడుతూ సహజ వ్యవసాయం, సమగ్ర వ్యవసాయం భవిష్యత్ తరాల ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం, పర్యావరణ పరిరక్షణకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో కూలీల కొరతను అధిగమించేందుకు వ్యవసాయ యాంత్రీకరణను మరింత విస్తరించాలని సూచించారు. కెనడా, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో తక్కువ మంది రైతులతో అధునాతన యాంత్రికరణ ద్వారా అధిక శాతం విస్తీర్ణం సమర్థవంతమైన సాగు జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రతి మూడు సంవత్సరాలకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల మార్పిడి చేసుకోవాలని, వ్యవసాయాన్ని కేవలం జీవనోపాధి నుండి వ్యాపార దృక్పథంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భూమి సారవంతం కోసం రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని, వనరుల విభిన్నీకరణ ద్వారా రైతుల ఆదాయం సాధ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి. సత్యవాణి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె. శీనా నాయక్, ఆత్మ పిడి, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## యాప్ విధానంలో యూరియా పంపిణి సరికాదు

- రోడ్డెక్కిన రైతులు




**బుచ్చి జూన్ 11 ప్రభాతవార్త** యూరియా కోసం మూడు రోజుల నుండి బ్యాంకు చుట్టు తిరుగున్నా సకాలంలో యూరియా అందడం లేదనిసహనం కోల్పోయిన రైతులు గురువారం ఉదయం బాంబేరోడ్డుపై బైఠాయించి రాస్తారోకు నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు యూరియా, డిఏపి, రైతులకు సప్లై చేసేందుకు ఒక యాప్ ప్రవేశపెట్టిందని ఆయాప్ డౌన్‌లోడ్ చేసుకొని యాప్‌లో వస్తేనే యూరియా సప్లై ఇస్తామని యాప్ సరిగా పనిచేయపోవడంతో రైతులకు యూరియా డిఏపి అందకపోవడంతో రైతులు ఆంధోళన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అద్యక్షులు ముత్యాల గురునాదం మాట్లాడుతు గతంలో కార్డు ద్వారా రసాయన ఎరువులు పంపిణి చేశారు. సోమవారం నుండి యాప్ విధానం ప్రవేశపెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపద్యంలో రోడ్డుపైన ట్రాపిక్ ఆగిపోవడంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి వ్యవసాయాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని రైతును శాంతి పరిచారు. అనంతరం వ్యవసాయశాఖ అధికారులు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వ్యవసాయశాఖ సిబ్బందితో మాట్లాడి సాయింత్రం లోపల సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కౌలు రైతు సంఘం అద్యక్షులు ముత్యాల గురునాదం, చల్లకొలును మల్లికార్జున రావు, రైతులు పాల్గోన్నారు.

## గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- స్కానింగ్ సెంటర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే 18002332447కు సమాచారం ఇవ్వండి - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – కలెక్టరేట్** జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా టోల్ ఫ్రీ నెంబరు 1800233 2447 కు వెంటనే ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరు వారి క్యాంపు కార్యాలయంలో గర్భస్త పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పిసిపిఎన్‌డిటి), సహాయక పునరుత్పత్తి సాంకేతికత చట్టం (ఏఆర్‌టి) అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు అన్నీ ప్రభుత్వ నిబంధనల మేరకు పనిచేయాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలు అరికట్టేందుకు, నిర్వాహకులపై కఠిన తీసుకునేందుకు జిల్లాలో వైద్యశాలలు, స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు మరింత ముమ్మరంగా నిర్వహించాలన్నారు. స్కానింగ్ సెంటర్ల తనిఖీలలో సీనియర్ మెడికల్ ఆఫీసర్లు కూడా పాల్గొనాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ చెప్పారు. వైద్యులు, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వి.సుజాత, డిఐఓడాక్టర్ ఏ. ఉమామహేశ్వ రి, గైనకాలజిస్ట్ డాక్టర్ ఆండాళ్ భాస్కర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, డెమో కె. కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి

### ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – వైద్యం** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రజల నుంచి నేరుగా వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అలాగే మంత్రి ప్రజల సమస్యలను ఓపికగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేవాదాయ శాఖకు సంబంధించిన వినతులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం రామానారాయణ రెడ్డి స్పష్టం చేశారు. ఈ గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి ఆనం రామానారాయణ రెడ్డితో పాటు ఆంధ్రప్రదేశ్ నూర్బాష, దూదేకుల సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కే. నాగుల మీరా కూడా పాల్గొన్నారు.

## పరిశ్రమలలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి - కాకాణి



**ముత్తుకూరు, జూన్ 11, ప్రభాతవార్త** పరిశ్రమలలో స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో భూములు ఇచ్చి కాలుష్యాన్ని భరిస్తూ, తమ ప్రాంతాలలో పరిశ్రమలు నెలకొల్పితే, తమ బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో సహకరిస్తున్న స్థానికుల కుటుంబాలకు చెందిన యువతకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిందిగా మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డా కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. స్వార్థ ప్రయోజనాల కోసం చెరువులో నీటిని తోడుతూ, మత్స్య సంపదకు హాని కలిగిస్తూ, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీయ దంపై మండిపడ్డారు. అలాగే బాపనపాటి ప్రకాష్, సృజనల వివాహ వేడుకలలో వధూవరు లను మాజీ మంత్రి కాకాణి ఆశీర్వదించారు.

**కాకాణి మాట్లాడుతూ** పరిశ్రమల స్థాపనలో స్థానికులు కీలక పాత్ర పోషిస్తున్నందున, స్థానికులను ఆదుకునే విధంగా తప్పనిసరిగా ప్రాధాన్యతను ఇచ్చి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. స్థానికులకు ఖచ్చితంగా 75 శాతం ఉద్యోగాలు కేటాయించాల్సిందేనని జగన్ మోహన్ రెడ్డి గారు శాసనసభలో చట్టం చేశారన్నారు. పరిశ్రమల యాజమాన్యం మాత్రం, జగన్మోహన్ రెడ్డి స్థానిక కుటుంబాల ఉన్నతిని ఆకాంక్షించి తీసుకువచ్చిన చట్టాన్ని బేఖాతరు చేస్తున్నారన్నారు. పరిశ్రమల యాజమాన్యం సిఎస్ఆర్ నిధుల పేరిట కొంత మందికి ఎరవేసి ఉద్యోగులకు కనీస వేతనం చెల్లించకుండా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సెయిల్ ఇంజనీరింగ్ కంపెనీలో పని చేస్తున్న తమకు వేతనాలు పెంచాలంటూ దాదాపు నెల రోజులపాటు కార్మికులు, సమ్మె చేపట్టారని, కార్మికులు కొందరు నా దగ్గరకు వచ్చిన వెంటనే, జిల్లా కలెక్టర్ తో మాట్లాడి, కార్మికుల చట్టం ప్రకారం, కార్మికులకు వేతనం చెల్లించేందుకు చర్యలను చేపట్టాలని కోరారన్నారు. కలెక్టర్ స్పందించి, కార్మిక శాఖ అధికారులను పంపించి, విచారణ చేయించి తగు చర్యలు చేపడతానని సానుకూలంగా స్పందించారు. ఎట్టకేలకు యాజమాన్యం దిగివచ్చి, కార్మికుల వేతనాలు సవరించడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. మండల కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, విజయమ్మ, సుబ్రహ్మణ్యం, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ సంజీవిని

- మంత్రి నారాయణ - సిటీ నియోజకవర్గంలో రెండేళ్లలో 4 కోట్ల భారీ సాయం - పేదలకు సీఎం సహాయ నిధి కొండంత అండ
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తగ్గని సాయం - 49 మందికి 32 లక్షల చెక్కులు పంపిణీ చేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – వైద్యం** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేస్తున్నారని, సీఎంఆర్ఎఫ్ అనేది పేదల పాలిట సంజీవినిగా పనిచేస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 49 మంది లబ్ధిదారులకు 32,17,600 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి నారాయణ చేతులమీదుగా క్యాంపు కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. గత రెండేళ్ల కాలంలో నియోజకవర్గంలో 433 మందికి 4,04,98,692 విలువైన చెక్కులను అందజేసి ఆదుకున్నామని మంత్రి వెల్లడించారు. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించడమే లక్ష్యంగా తాము ప్రారంభించిన నారాయణ నేత్రజ్యోతి, దంత సురక్ష ద్వారా కేవలం 4 నెలల్లోనే 10 వేల మందికి వైద్య పరీక్షలు చేసి, ఐదు వేల మందికి ఉచితంగా కంటి అద్దాలు, మరో ఐదు వేల మందికి దంత పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను డిసెంబర్ కల్లా వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, టీడీపీ నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

## నేడు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద సామూహిక యోగా

- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – కలెక్టరేట్** నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వద్ద శుక్రవారం ఉదయం 6 గంటలకు సామూహిక యోగా (థీమాటిక్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 12న శుక్రవారం ఉదయం రెసిడెన్షియల్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో థీమాటిక్ యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెసిడెన్షియల్ అసోసియేషన్లు, ఎన్జీవో ఆర్గనైజేషన్లు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జూన్ 16న రామతీర్థం బీచ్, జూన్ 17న స్వర్ణాల చెరువు వద్ద ప్రత్యేక పర్యాటక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మానసిక ఆనందానికి, శారీరక దృఢత్వానికి యోగా ఒక దివ్యౌషధమని, ప్రజలందరూ ఈ సామూహిక యోగా కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని యోగాపై అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## పిల్లలకు మోత.. పెద్దలకు వాత !

**కోట,జూన్ 11 ప్రభాతవార్త :** ప్రైవేటు విద్యా సంస్థల్లో పాఠ్య,నోటు పుస్తకాలు తల్లిదండ్రులు, పిల్లలకు మోయలేని భారమవుతోంది. ప్రైమరి నుంచి ఏడో తరగతి వరకు కేవలం పుస్తకాలు ,విద్యా సామగ్రికి రూ 4 వేల నుంచి రూ 10 వేల 8 వ తరగతి నుంచి 10 వ తరగతి వరకూ 15 నుంచి 18 వవేలు ఖర్చువుతోంది. ప్రవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్దంగా పుస్తకాలు విద్యా సామగ్రి విక్రయి స్తుండటంతో పాటు రెట్టుంపు ధరలు వసూలు చేస్తున్నారు. రెండు రోజుల్లోగా వచ్చి పుస్తకాలు, విద్యా సామగ్రి తీసుకళ్లాలంటూ తల్లిదండ్రులకు హుకుం జారీ చేస్తున్నారు.మొక్కుబడిగా తనిఖీలు.కోట మండల ంలోని విద్యా నగర్, కోటల్లో ప్రైవేటు పాఠశాల్లో ఈ దందా జరుగుతుందని విద్యార్ధి సంఘాలు ఆరోపి స్తున్నాయి. పాఠ్యపుస్తకాలు విద్యా సామగ్రిని పాఠశాలల్లో విక్రయించకూడదనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడంలేదు. ఎంఈఓలు పాఠశాలల్లో కనీసం తనిఖీలు నిర్వహించిన పరిస్థితి కనిపించడం లేదు.

## కంటైనర్ సబ్‌స్టేషన్ పనులను పరిశీలించిన జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు టౌన్ డివిజన్ పరిధిలోని గాంధీ బొమ్మ సమీపంలో నెల్లూరు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేస్తున్న కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీ కె. రాఘవేంద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కంటైనర్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన స్లాబ్ నిర్మాణ పనులను ఆయన దగ్గరుండి పర్యవేక్షించి, పనుల పురోగతిపై అధికా రులతో సమీక్ష నిర్వహించారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు కంటైనర్ సబ్‌స్టేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) పరంధామయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టౌన్) శ్రీధర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) సురేష్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల కంటే మధ్యవర్తులే ఎక్కువ

– తహసీల్దార్ కార్యాలయంలో మధ్యవర్తుల బెడద



**ఉదయగిరి, జూన్ 11, ప్రభాతవార్త :** ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల సంఖ్య కంటే ఎక్కువగా మధ్యవర్తుల సంఖ్య ఉంటుందని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. బర్త్ సర్టిఫికేట్ దగ్గర నుంచి డెత్ సర్టిఫికేట్ వరకు సామాన్య గ్రామీణ ప్రజలు అధికారుల మొహం చూడకుండానే వారి పని పూర్తి అవుతుంది. సచివాలయ వ్యవస్థ ఉన్నప్పటికి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ లబ్దిదారులు తిరగాల్సిందే అనేది నిజం. కారణం ఏమిటంటే మధ్యవర్తులే దరఖాస్తు స్వీకరించి మధ్యవర్తులే సంబంధిత సర్టిఫికేట్ వారికి అందజేస్తారు. బర్త్, డెత్ సర్టిఫికెట్ల పరిస్థితి ఎలా ఉన్నా ఎవరికి ఇబ్బంది లేదు. కానీ, తరతరాల నుండి వారసత్వంగా తమ కుటుంబాలకు సంక్రమిస్తున్న భూములు కూడా వారికి కాకుండా పోతుండడం బాధగా అనిపిస్తుందని ఈ పరిణామాలన్నీ రీ సర్వే తర్వాత చోటు చేసుకున్నాయని అంతకుమందు కూడా ఉన్నాయని వాటికంటే రీ సర్వే తర్వాత వచ్చిన పరిణామాలు ప్రమాదకరంగా ఉన్నాయని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సర్వేయర్‌లు కూర్చునే ఆఫీసు గది నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ వరకు కూడా సామాన్య ప్రజలు తమ సమస్య గురించి మాట్లాడేందుకు వెళ్తే అనుమతి నిరాకరించబడుతుంది. కారణం ఏమిటంటే స్థానికంగా నాయకులుగా చలామణి అయ్యే కొందరు అధికారుల దగ్గరే తిష్ట వేసుకొని కూర్చోవడం. పాత రికార్డులు తిరగ వేసుకుంటూ కొత్త ప్రణాళికలు రచించుకుంటూ కూర్చోవడం వల్ల సామాన్యులకు సదరు అధికారులతో మాట్లాడే అవకాశం దొరకడం లేదని రెవెన్యూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కార్యదర్శుల విషయానికొస్తే కొంత మంది అధికారమా..! ప్రతిపక్షమా..! అనేది కాకుండా ఏ నాయకుడు వచ్చి బండి మీద ఎక్కించుకుంటే రికార్డు సంకలో పెట్టుకుని సదరు నాయకుడి వెంట బయలుదేరి వెళ్ళిపోతున్నారని ఎవరైనా అడిగితే తహసీల్దార్ ఫీల్డ్ మీదకి వెళ్ళమని చెప్పారు. అక్కడ ఫీల్డ్ వర్క్ చేస్తున్నాము అనే సమాధానం వస్తుందని కార్యాలయం చుట్టూ తిరిగే బాధితులు వాపోతున్నారు. అధికారులు, ఇలా ప్రజలను పక్కన పెట్టి గ్రామస్థాయి నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో నిజమైన పేదవాళ్లు, భూమి హక్కు దారులు నష్టపోతున్నారని ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయ పరిస్థితి జిల్లా ఉన్నతాధికారులు మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఉదయగిరి మండలం కుర్రపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో అనధికార వైద్య సేవలపై విచారణ



**ఉదయగిరి, జూన్ 11, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని కుర్రపల్లి గ్రామంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లో అనధికారిక వైద్య సేవలు అందిస్తున్నారనే ఫిర్యాదు మేరకు వైద్యశాఖ అధికారులు తనిఖీ నిర్వహించారు. తనిఖీ సమయంలో క్లినిక్ మూసివేసి ఉండడం గమనించబడింది. విచారణలో భాగంగా గాయపడిన ఒక మహిళ నుంచి వివరాలు సేకరించగా, ఆమె ఉపాధి హామీ పథకం పనుల సమయంలో గాయపడినట్లు తెలిపింది. అనంతరం కుర్రపల్లి గ్రామంలోని ఆర్‌ఎంపీ క్లినిక్‌ను ఆశ్రయించగా, అక్కడ గాయానికి కుట్లు, శస్త్ర చికిత్స సంబంధిత చికిత్స అందించినట్లు వెల్లడించింది. కుట్లు వేసిన నాలుగు రోజుల అనంతరం గాయంలో ఇన్ఫెక్షన్ ఏర్పడడంతో ఆమె కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఉదయగిరిని ఆశ్రయించింది. అక్కడ వైద్యులు గాయానికి డ్రెస్సింగ్ చేసి తగిన చికిత్స అందించారు. అనంతరం నిర్వహించిన 104 వైద్య శిబిరంలో కూడా గాయానికి డ్రెస్సింగ్, అవసరమైన చికిత్స పొందినట్లు తెలిపారు. అర్హత లేని వ్యక్తులు అనుమతి లేకుండా శస్త్ర చికిత్సా విధానాలు నిర్వహించడం ప్రజారోగ్యానికి హానికరమని వైద్యశాఖ హెచ్చరించింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, సంబంధిత నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని డాక్టర్ ఎం.శివకల్పన అధికారులు తెలిపారు.

## స్వచ్ఛ గ్రామాలకు ప్రజలు సహకరించాలి



**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** గ్రామాలు పూర్తిస్థాయిలో స్వచ్ఛ గ్రామాలుగా మారేందుకు ప్రజలు తమవంతుగా సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. కోవూరు మండలం వేగూరు పంచాయతీలో ఉన్న చెత్త నుంచి సంపద కేంద్రాన్ని గురువారం ఆయన స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెత్త నుంచి సంపద కేంద్రానికి మైనర్ రిపేర్లు ఉన్నాయని, వీటిని వెంటనే చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న స్వచ్ఛ రథం వద్ద గ్రామస్తులకు అవగాహన కల్పించేలా డిప్యూటీ ఎంపీడీవో చర్యలు చేపట్టారు. ఈ స్వచ్ఛ రథాన్ని గ్రామస్తులు ఉపయోగించుకుని తమ దగ్గర నుంచి ప్లాస్టిక్, ఇనుము ఇచ్చి దానికి తగ్గట్టుగా నగదుకానీ, సామాన్లు కానీ పొందాలన్నారు.

## సి.హెచ్.యడవల్లిలో అంగన్‌వాడీ పిలుస్తోంది



**ఆత్మకూరు, జూన్11, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని సి.హెచ్. యడవల్లి హెచ్‌డబ్ల్యు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సెక్టార్ సూపర్ వైజర్ జి.కస్తూరి హాజరయ్యారు. ముందుగా మహిళలు, చిన్నారు లతో గ్రామంలో 3సంవత్సరాలు పూర్తయిన చిన్నారులందరూ అంగన్‌వాడీ కి రండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఈసమా వేశంలో సూపర్‌వైజర్ కస్తూరి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని 3సంవత్సరాలు పూర్తయిన చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తల్లిదండ్రులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆట, పాటలతో పూర్వవిద్యను అందిస్తారని, విద్య, వైద్య, ఆరోగ్యం గురించి జాగ్రత్త వహిస్తారన్నారు. కావున తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.విజయమ్మ, ఎ.మస్తానమ్మ, హెల్పర్లు, మహిళలు, చిన్నారులు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## గొల్లపల్లి లో అంగన్‌వాడీ పిలుస్తోంది



**ఆత్మకూరు, జూన్11, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్త దొరసానమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీకి రండి ఆటపాటలతో విద్యను పొందండి, అంగన్‌వాడీ కి రండి మానసిక ఉల్లాసాన్ని పొందండి అంటూ నినాదాలు చేస్తూ ముందుగా చిన్నారులతో తమ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దేవసేనమ్మ, కృష్ణకుమారి, మహిళలు, చిన్నారులు, కిశోరిబాలికలు పాల్గొన్నారు.

## వైభవంగా అన్నదానం



**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న షిరిడీ సాయి మందిరంలో గురువారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ఉభయకర్తలుగా దాసరరాజు హిమవతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పచ్చిపాల రాజా విక్రమ్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## ఆటోలు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు

..ఎస్ఐ కె. తిరుమల రావు



**రాపూరు, జూన్ 11, ప్రభాతవార్త :** మండలంలోని ఆటో యజమానులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు, రవాణా నిబంధనలు పాటించాలని లేని పక్షంలో చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాపూరు ఎస్ఐ కె. తిరుమల రావు హెచ్చరించారు. గురువారం మదలమడుగు సెంటర్‌లో ఆర్టీసి పరిరక్షణలో బాగంగా ఆర్టీసి సిబ్బందితో కలసి ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌లు తప్పని సరిగా డ్రైవింగ్ లెసెన్స్ కలిగి వుండాలన్నారు. వాహనానికి సంబందించిన పత్రాలు, ఇన్సూరెన్స్, పోల్యుషన్ పత్రం వంటివి వుండాలన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి రవాణా చేయరాదని, మద్యం తాగి వాహనాలు నడపకుడాదన్నారు.అలా కాకుండా నిబందనలు ఉల్లంఘిస్తే వారిపై చట్ట ప్రకారం కేసులు నమెదు చేసి చర్యలు తీసుకుంటామన్నరు.

## గుర్తు తెలియని వాహనం ఢీ వ్యక్తి మృతి



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కావలి రూరల్ మండలంలోని రుద్రకోట జాతీయ రహదారిపై పాలిటెక్నికల్ కళాశాల వద్ద బుధవారం రాత్రి జరిగింది. రూరల్ పోలీసుల సమాచారం మేరకు రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల వద్ద జాతీయ రహదారిపై రోడ్డును దాటుతూ సుమారు (25)ఏళ్ళు కలిగి గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరకు తరలిస్తుండగా మార్గమద్యంలో మృతి చెందాడు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని బంధువులు ఎవరైనా రూరల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేవ్వరావుని కలవాలని తెలిపారు.

## ప్రధానిగా 12సంవత్సరాలపూర్తితో ప్రత్యేక పూజలు



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** పేదరిక నిర్మూళనే ధ్యేయంగా పిఎం నరేంద్రమోడీ విశేష కృషి చేసి 12ఏళ్ళ పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా బాజాపా రాష్ట్ర కోశాధికారి కందుకూరు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెడీ ప్రభుత్వం వచ్చాక దేశంలో 20కోట్లు మంది నిరుపేదలు మధ్యతరగతి వర్గానికి రావడం జరిగిందన్నారు. స్వచ్ఛభారత్ నిర్మల అభియాన్ పథకం కింద కోట్లాది మంది పేద మహిళలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించారన్నారు. ఈ పూజల్లో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ ఛైర్మెన్ బచ్చు వీరాస్వామి, సివిసి సత్యం, బిజెపి రాష్ట్ర మోర్చా, రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్నికంటి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు, పి.మాధవి, పట్టణ కార్యదర్శి మట్టా మల్లికార్జునరావు, సువర్ణ శ్రీనివాసులు, చవేరా వెంకటరామయ్య, ఏల్చూరి రవి, భాస్కర్, ప్రసాద్, శ్రీనివాసులు, మంగమూరి వెంకట్‌రెడ్డి, వాసవి వనిత, లెజెండ్ మహిళా నాయకురాలు దుగ్గుశెట్టి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## గూడల ఆదెమ్మకు నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** కావలి పాతూరు ఈతముక్కల వారి వీధిలోని స్వగృహంలో నిర్వహించిన గూడల అదెమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆదెమ్మ మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసి ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్తిస్తూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## పాతాళపల్లి ఎస్టీ కాలనీలో అంగన్‌వాడీ పిలుస్తోంది



**అనంతసాగరం,జూన్11,ప్రభాతవార్త:** అనంతసాగరం మండలంలోని పాతాళపల్లి ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ శారద హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక, సృజనాత్మకత,సామాజిక అభివృద్ధులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పునాది వేస్తారన్నారు. కావున 3సంవ్సరాలు పూర్తయిన పిల్లలందరిని తప్పక అంగన్‌వాడీకి పంపించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కొత్తూరు రాణి, హెల్పర్ వెంకటరమణమ్మ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు .

## గ్రామ సమస్యల పరిష్కారానికి చర్యలు

– తహసిల్దార్ పద్మజాకుమారి



**ఆత్మకూరు ,జూన్11,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని కరటంపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన "వన్‌మంత్ - వన్ విలేజ్-ఫోర్ విజిట్" కార్యక్రమంలో గ్రామ ప్రజలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వన్‌మంత్-వన్‌విలేజ్-ఫోర్ విజిట్ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## సాయినామ స్మరణతో దత్త సాయిబాబా ఆలయం భక్తిమయం



**విడవలూరు, జూన్ 11 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని దత్త సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి పాలాభిషేకం, అర్చన, పూలంగి సేవ, హోమం నిర్వహించారు. భక్తభక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమాలను ఉభయ దాతలు మిరియం కృష్ణ, శ్రీలత దంపతులు నిర్వహించగా, అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని దాత కోడి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## టెక్కే అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిలుస్తోంది



**ఆత్మకూరు ,జూన్11,ప్రభాతవార్త:** ఆత్మకూరు పట్టణంలోని టెక్కే అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం. నారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ పిలుస్తోంది కరప త్రాలను తల్లులకు పంచిపెట్టారు. 3సంవత్సరాలు నిండిన ప్రతి బిడ్డను తమ అంగన్‌వాడీ కేంద్రానికి పంపని ఆమె తల్లులను కోరారు. ఈకార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, మహిళలు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

## జగనన్న నామస్మరణ చేయనిదే టిడిపికి పూట గడవదు : పూజిత



నెల్లూరు, జూన్ 11 ప్రభాతవార్త – వైద్యం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమా వేశం నిర్వహించి, మాట్లాడిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత కూటమి ప్రభుత్వంపై, చంద్రబాబు రెండేళ్ల పాలనపై ధ్వజమెత్తిన పూజితమ్మ రాష్ట్రంలో కూటమి పాలన రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా, ప్రజలకు జరిగిన మోసాలను వారు పడుతున్న కష్టాలను ఎండ గట్టేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతుంది కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ వెన్నుపోటుకు రెండేళ్ల అనే కార్యక్రమంతో మేము ప్రజల్లోకి వెళ్తున్నాము ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4వ తేదీ నుండి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన జూన్ 12వ తేదీ వరకు ఈ వారం రోజుల పాటు పార్టీ తరపున వివిధ నిరసన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నాం జూన్ 4,5 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయిలో భారీ ర్యాలీలను నిర్వహించాం జూన్ 8.9 తేదీలలో ప్రజలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించి, ఈ రెండేళ్ల కూటమి పాలనలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, బాధలను అడిగి తెలుసుకున్నాం జూన్ 12వ తేదీన రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ర్యాలీలు నిర్వహించేందుకు వైయస్సార్ సీపీ సిద్ధమవుతోంది ప్రజల కష్టాలను తెలుసుకుని, వారి తరపున పోరాడాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా మాపై ఉంది కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ రాజీలేని పోరాటం చేస్తుంది ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అటకెక్కించింది తల్లి వందనం పథకానికి నిధులు ఇవ్వకుండా ఒక్కో తల్లికి 15000 ఇస్తానని చెప్పి, ఒక సంవత్సరం ఎగ్గొట్టి, తర్వాత ఒక్కో తల్లి ఖాతాలో 7 వేలు,9వేలు వేసి మిగిలిన డబ్బులు టు కంటిన్యూడ్ (To be continued) అనే సీరియల్ లాగా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు , తల్లికి వందనం పథకం అందకుండా దాదాపు 20 లక్షల మందికి పూర్తిగా కోత పెట్టారు ఎన్నికల సమయంలో ఇంటింటికీ దీపం పథకం కింద ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు ఆ పథకాన్ని అటకెక్కించారు ఉచిత బస్సు ప్రయాణం లోనూ అన్ని ఆంక్షలు కొన్ని బస్సులకు మాత్రమే పరిమితం చేసిన ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి , నిత్యావసర వస్తువుల ధరలతో పాటు కరెంట్ బిల్లులు కూడా సామాన్యుడికి భారంగా మారాయిఎన్నికలకు ముందు 18 ఏళ్ల నుండి 60 ఏళ్ల లోపు ఉన్న మహిళలందరికీ ఖిఆడబిడ్డ నిధిఖి కింద నెలకు రూ. 1500 ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చాడు నిరుద్యోగులకు, నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా ఎగనామం పెట్టాడు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా, ఉన్న వాలంటీర్ వ్యవస్థను తొలగించి వారిని ఇంట్లో కూర్చోబెట్టాడు అన్నదాత సుఖీభవ అని చెప్పిన చంద్రబాబు నాయుడు, తానే సుఖంగా ఉన్నాడు కానీ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అత్యంత అధ్వానంగా మారింది రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా ధరలు పెరిగిపోయి, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలే శరణ్యం అంటున్నారు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినది మెగా డీఎస్సీ కాదు, నిరుద్యోగులను నట్టేట ముంచే ఒక ఖిమెగా మోసంఖి, మెగా దుర్మార్గం గతంలో ఉన్న 29 క్రీడల (స్పోర్ట్స్) కోటాను చంద్రబాబు ప్రభుత్వం 65కు ఎందుకు పెంచిందో చెప్పాలి గతంలో ఉన్న స్పోర్ట్స్ కోటా 2 ని 3 నికి ఎందుకు పెంచారో సమాధానం చెప్పాలి రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చిన క్రీడాకారులను గౌరవించి ఉద్యోగాలు ఇవ్వాలనే ఉద్దేశంతో కాకుండా, కేవలం ఖిపార్టిసిపేషన్ సర్టిఫికేట్ఖి (కేవలం పాల్గొన్నట్లు ఉన్న పత్రం) ఉన్న వారికి కూడా ఉద్యోగాలు కట్టబెట్టడం వెనుక ఉన్న అంతర్యమేమిటి సర్వీస్ రూల్స్ మార్చి, స్పోర్ట్స్ కోటా వారికి పరీక్ష లేకుండా నేరుగా ఉద్యోగాలు ఎందుకు ఇచ్చారో ఎవరూ సమాధానం చెప్పడం లేదు డీఎస్సీ ప్రక్రియ ముగిసిన వెంటనే మళ్లీ పరీక్షను తప్పనిసరి చేస్తూ నిబంధనలు మార్చడం నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లడమే వైఎస్సార్సీపీ అధికారంలో లేకపోయినా, ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతో జగన్ మోహన్ రెడ్డి ఉక్కు పరిశ్రమ ప్రమాద బాధితులకు 100 న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు నేను అధికారంలోకి వచ్చాక ఖచ్చితంగా కాంపెన్సేషన్ ఇస్తాను, ధైర్యంగా ఉండండి" అని జగనన్న ప్రజలకు అండగా నిలిచారు బాధితులు తమ కష్టాలు చెప్పుకోవడానికి వస్తే, లోకేష్ మీ కుటుంబ సభ్యులు ఎవరైనా చనిపోయారా?" అంటూ బాధ్యతారహితంగా మాట్లాడాడు చంద్రబాబు సొంత కార్యక్రమమైన ఖిమహానాడుఖి లో కూడా తమ పార్టీ చేసిన పనులు గురించి మాట్లాడుకోకుండా,జగనన్న నామస్మరణకే పరిమితమయ్యారు జగనన్న పేరు ప్రస్తావించకుండా టిడిపి ఒక్క కార్యక్రమం కూడా నిర్వహించలేదు 12వ తేదీ చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన ర్యాలీకి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మరియు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి, చంద్రబాబు ప్రభుత్వం పై తమకున్న అసంతృప్తిని, నిరసనను తెలియజేయాలని కోరుకుంటున్నారు

## మూడు రోజులు పాటు శ్రీరాముని ఉత్సవాలు

**సీతారామపురం జూన్ 11 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని ఓగూరు వాండ్ల పల్లి గ్రామంలో నేటి నుండి మూడు రోజుల పాటుశ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమీటి నిర్వాహకులు గురువారం తెలిపారు.శుక్రవారం కళ్యాణం, శనివారం పారువేట,ఆదివారం పోలేరమ్మకు పొంగళ్ళు నిర్వహిస్తామని 3 రోజులు పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు.భక్తులు ఉత్సవాలలో పాల్గొని జయప్రదం చేయాలని ఉత్సవ కమీటి సభ్యులు తెలిపారు.

## చిన్నారులను తప్పని సరిగా అంగన్‌వాడీలకు పంపాలి



**రాపూరు, జూన్ 11, ప్రభాతవార్త :** 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలను తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని రాపూరు ఐసిడిఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాధిక కోరారు.గురువారం రాపూరులోని బీసికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సిడిపిఓ సునంద ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు కావలసిన పౌష్టికాహారం అందించడంతో పాటు, వారికి ఆటపాటలతో కూడిన విద్యను భోదించడం జరుగుతుందన్నారు. వారికి క్రమం తప్పకుండా ఆరోగ్య పరిక్షలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసి కాలనీ అంగన్‌వాడీ కార్యకర్త షేక్ మెహతాజ్, పలువురు చిన్నారుల తల్లిదండ్రులు వున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త మెహతాజ్

## వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఖత్ బచావో ర్యాలీ




**ఉదయగిరి, జూన్ 11, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల నుండి గండిపాలెం రోడ్డు మీదుగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మానవహారం అనంతరం శ్రీకృష్ణ దేవరాయల ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయ ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. అలాగే అధిక రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడానికి ప్రత్యామ్నాయ ఎరువులైన జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులు, వానపాముల ఎరువులను వాడడం, భూసార పరీక్షలు చేయించుకొని, వాటి ఆధారంగా ఎరువులు వాడుకున్నట్లయితే సాగు ఖర్చు తగ్గుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు గోపికృష్ణ, రఘునాథరెడ్డి, సునీత, దుర్గా ప్రసాద్, పి.లావణ్య కుమారి, మిట్ట కిషన్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరి మండలంలో పలు సచివాలయాలు తనిఖీ



**ఉదయగిరి, జూన్ 11, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం సచివాలయం తిరుమలపురం సచివాలయం వెంగళరావు నగర్ సచివాలయం ఉదయగిరి బిట్టు ఒకటి బిట్టు 2 బిట్టు 3 గ్రామ సచివాలయాలను గురువారం ఎంపీడీవో సుకుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన రికార్డులు పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు బయోమెట్రిక్ హాజరు ఉదయం సాయంకాలం హాజరు వేయాలన్నారు.బయోమెట్రిక్ హాజరు 100 శాతం చూపాలన్నారు. సర్వేలలో 100 శాతం పూర్తి చేసి ఉండాలి పెండింగ్ ఎవరు పెట్టుకోకూడదని సూ చించారు. విధుల్లో అలసత్వం వహించరాదన్నారు.

## ఆటోను ఢీకున్న లారీ -పలువురుకిగాయాలు



**సీతారామపురం జూన్ 11 ప్రభాతవార్త :** రోడ్డు చివర ఆగివున్న ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో రోడ్డుపై నుండి కిందకి పడడంతో పలువురు ఆటోలోని ప్రయాణికులకు గాయాలైన ఘటన సీతారామపురంలో చోటు చేసుకుంది. వివరాలకు వెళ్ళి తే సీతారామపురంలో గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద నుండి తారురోడ్డు వేసే ప్రజర్న్ లారీపై తీసుకొని చిన్ననాగంపల్లి హైవే క్యాంపు వద్దకు వెళుతుండగా బోద సిద్దాయ పల్లి నుండి సీతారామపురంకు ప్రయాణికులతో వస్తున్న ఆటోను లారీపై ఉన్న ప్రజర్ చివరి బాగం ఆటోకి తగలడంతో ఆటోరోడ్డుపై నుండి కంద పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో సహా పలువురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. న్యాయం చేయాలని లారీ వద్ద బాధితులు ఆందోళన నిర్వహించారు. బాధితులకు న్యాయం చేయకపోగా ఆందోళన చేసిన బాధితులను బెదిరింపులకు గురి చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

## గ్రంధాలయం మూసివేతను నిరసంచిన గ్రామస్తులు



**సీతారామపురం జూన్ 11 ప్రభాతవార్త :** గత 40 సంవత్సరాలు సీతారామపురం మండలంలోని నిరుద్యోగులకు , విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులో వుంటు విజ్ఞానాన్ని అందిస్తు భవిష్యత్తుకు ఉపయోగ పడుతున్న సీతారామపురంలోని గ్రంధాలయం మూసి వేతను తీవ్రంగా ఖండిస్తు గురవారం పాఠకులు గ్రంధాలయం బయట ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల సీతారామపురం మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంధాలయంలో నియామక సిబ్బంది లేకపోవడంతో గ్రందాలయం మూసివేతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గ్రంధాలయ పాఠకులు ఆందోళన నిర్వహించారు. గత 40 సంవత్సరాల నుండి నిరుద్యోగులు విద్యార్థులకు పోటీ పరీక్షల ప్రణాళికలు సిలబస్, విజ్ఞానాన్ని పెంపొందించేలా విషయాలు తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడిన గ్రంధాలయంను మూసి వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా గ్రంధాలయ ఛైర్‌పర్సన్ మేకపాటి శాంతకుమారికి పాఠకులు లేఖను వ్రాశారు.

## మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ ఆపాలి: సిఐటియు



**గూడూరు, జూన్ 11, ప్రభాతవార్త :** మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 14 కీలక విభాగాలను పిపిపి పద్ధతిలో ప్రైవేటీకరించాలని, రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడం సరిగా లేదని, మున్సిపాలిటీలలో జరిగే లోపాలను సరిదిద్ది, ప్రభుత్వపరంగా పౌర సేవలు నిర్వహించాలి గాని, ఈ విధులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల దశాబ్దాల తరబడి ప్రజారోగ్యంపర్యావరణం పరిరక్షణకు ఎండలు, వానలు, వరదలు, తుఫానులు, కరోనా వంటి ప్రకృతి వైపరీత్యాలతో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు తీవ్రం నష్టం చేకూరుస్తూ ఉందని, అంతేగాక ప్రజలు పట్టణ ప్రజానీకానికి ప్రభుత్వం పట్ల అసంతృప్తి పెరగడానికి దారితీస్తుందని, కనుక ప్రభుత్వం ప్రైవేటీకరణ విషయంలో పునరాలోచించి ప్రజా అనుకూలమైన విదానం తీసుకురావాలని వారు డిమాండ్ చేసారు. అనంతరం గూడూరు ఇన్‌ఛార్జ్ కమిషనర్ డి.సోమశేఖర్‌కి నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ధారా కోటేశ్వరరావు, గూడూరు సిఐటియు ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య మున్సిపల్ సంఘ సహాయ కార్యదర్శి జి.మని, భూలోక మురళి నాయకులు బి. అనిల్, యస్.సుబ్రహ్మణ్యం, ఆర్.ఆనంద్, జి.మేరీ, పిబి పెంచలమ్మ, కె.పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

### రాజకీయ పార్టీల సమీక్షా సమావేశానికి జనసేన పార్టీని నిర్లక్ష్యం చేస్తున్న తాసిల్దార్



**ఇందుకూరుపేట, జూన్ 11, ప్రభాతవార్త :** మండల తాసిల్దార్ కార్యాలయంలో గురు వారం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమీక్షా సమావేశానికి స్థానిక జనసేన పార్టీ నాయకులను పిలవకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని జనసేన పార్టీ సీని యర్ నాయకులు గుడి హరి కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15వ తేదీ నుంచి బిఎల్‌ఏ, బిఎల్‌ఓలు గ్రామాల్లో పర్యటించి ఓట్ల తొలగింపు కొత్త ఓట్ల నమోదుపై సర్వే చేయనున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వైసీపీ, టీడీపీ, బీజేపీ నాయకులకు సమాచారం ఇచ్చి జనసేన నాయకులకు సమాచారం ఇవ్వకపోవడంపై జనసేన నాయకుడు గుడి హరి కుమార్ రెడ్డి మండిపడ్డారు. దీనిపై జనసేన పార్టీ నియోజక వర్గం సీనియర్ నాయకుడు హరికుమార్ రెడ్డి తాసిల్దార్ ని వివరణ అడగగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేసాము మీరు చూసు కోవాలి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. మండలంలో జనసేన నాయకులకుకనీస గౌరవం ఇవ్వడం లేదని ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి అన్ని పార్టీలకు సమాచారం ఇస్తారు గానీ జన సైనికులకు మాత్రం తెలపరని ఆవేదన వ్యక్తం చేశారు. మా అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అనే విషయం తాసిల్దార్‌కి గుర్తు లేనట్టు ఉందని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఉదయం మండల కార్యాలయం ఎదుట శాంతియుత నిరసన వ్యక్తం చేసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## దర్బాల్‌మిట్టలో ఆర్.ఓ. ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ



**ముత్తుకూరు, జూన్ 11, ప్రభాతవార్త :** మండలంలోని నిడిగుంటపాలెం పంచాయతీ పరిధిలో వున్న దర్బాల్‌మిట్టలో నూతన ఆర్.ఓ. ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ ఏ ఒలియో సంస్థ జనరల్ మేనేజర్ వినోద్ కృష్ణ కుమార్, మేనేజర్ హెచ్ఆర్ రాజేష్, మేనేజర్ వి. సీతారామయ్య పాల్గొని భూమి పూజ నిర్వహించారు. అలాగే గ్రామ పెద్దలు రావూరి బాబు నాయుడు, రావూరి పద్మ నాయుడు, రావూరి రాధాకృష్ణ నాయుడు, పి4 ప్రతినిధులు, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ జాకీర్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. దీంతో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఆనా ఒలియో యాజమాన్యం చేపట్టిన ఈ సామాజిక సేవా కార్యక్రమంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. దర్బాల్‌మిట్టలో ఆర్.ఓ. ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా గ్రామ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజలు ఆనా ఒలియో యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, సంస్థ చేపడుతున్న సామాజిక బాధ్యత కార్యక్రమాలను కొనియాడారు.

## అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



**కోట, జూన్ 11 ప్రభాతవార్త :** స్థానిక శ్యామసుందరపురంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసిడిఎస్ సిడిపిఓ ముని కుమారి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో చేరే చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి బోధన అందిస్తారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



**(కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెడికవర్ ఆస్పత్రి వారి సౌజన్యంతో శుక్రవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా బయాప్సీ, పాప్‌స్మియర్, రొమ్ము గడ్డల పరీక్ష చేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి మంచి అవకాశాన్ని కోవూరు నియోజకవర్గ పరిధిలోని క్యాన్సర్ రోగులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఇటువంటి మంచి అవకాశాన్ని కోవూరు ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు.

## నేడు ఆత్మకూరులో "వెన్నుపోటుకు రెండేళ్ళు" నిరసన కార్యక్రమం

**ఆత్మకూరు, జూన్11, ప్రభాతవార్త:** వైఎస్ఆర్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు " వెన్నుపోటుకు రెండేళ్ళు" నిరసన కార్యక్రమాన్ని ఆత్మకూరులోని మేకపాటి గౌతంరెడ్డి మెమోరియల్ మున్సిపల్ బస్టాండ్ నుండి ఆర్టీసి డిపో వరకు ర్యాలీ జరుగుతుందని, కావున వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ ఈర్యాలీకి హాజరై జయప్రదం చేయాలని మేకపాటి ఆత్మకూరు కార్యాలయ ప్రతినిధులు కోరారు.

## సిద్ధార్థ నగర్‌లో పోలీసుల కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్




**వింజమూరు, జూన్ 11, ప్రభాతవార్త:** నేర నియంత్రణ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వింజమూరు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. బుధవారం తెల్లవారు జామున పంచాయతీ పరిధిలోని సిద్ధార్థ నగర్‌లో విస్తృత స్థాయిలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు కలిగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. వింజమూరు ఎస్సై మాదాల ఉమామహేశ్వరరావు, జలదంకి ఎస్సై లతి పునిన్న షా, ఏఎస్ఐలు, సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. తెల్లవారు జామున నుండి సిద్ధార్థ నగర్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసు బృందాలు ఇంటింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సెర్చ్ ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 4 ఫోర్ వీలర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలను పరిశీలిస్తున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. అనుమానితుల వివరాలు పాత నేరస్తుల కదలికలపై ఆరా తీసి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సీఐ సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలిఅని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగులు, క్రికెట్ బెట్టింగులు, ఇతర అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతాయని, నేర రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని సీఐ స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో స్పెషల్ పార్టీ పోలీసులు, మహిళా పోలీసులు కూడా పాల్గొన్నారు.

## వైసీపీ నిరసన ర్యాలీని జయప్రదం చేయండి



**వింజమూరు, జూన్ 11, ప్రభాతవార్త :** ఉదయగిరిలో శుక్రవారం జరగనున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని మండల కన్వీనర్ రేవు నూరి శ్రీనివాసలు రెడ్డి పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటుకు రెండేళ్లనినాదంతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీ ఉదయం పది గంటలకు ఉదయగిరి ట్యాంక్ బండ్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు కొనసాగుతుందని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువ నాయకులు మేకపాటి అభినవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసింది. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, డీఎస్సీ నియామకాల్లో అవకతవకలు, స్థానిక సమస్యలను పట్టించుకోకపోవడం వంటి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలోని జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ కమిటీ నాయకులు, యువజన, మహిళా, రైతు విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలి అని శ్రీనివాసలు రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే వైసీపీ లక్ష్యమని, ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ర్యాలీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, క్రమశిక్షణతో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

## నూతన ఎస్ఐ జిలానీని సన్మానించిన టిడిపి నాయకులు



**అనుమసముద్రంపేట, జూన్11, ప్రభాతవార్త:** ఏఎస్‌పేట మండల నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన షేక్ జిలానీని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని పలు ప్రజా సమస్యలు, శాంతిభద్రతల అంశాలపై నాయకులు ఎస్ఐతో చర్చించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమవంతు సహకారం పోలీసు శాఖకు ఎల్లప్పుడూ ఉంటు ందన్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వానికి, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వహించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అబ్బూరి రమేష్‌నాయుడు, మండల మైనార్టీ నాయకుడు షేక్ జిలానీబాషా, మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, మండల ఉపాధ్యక్షుడు దేవరాల హజరత్తయ్య, నజీర్‌అహ్మద్, యస్దానీబాషా, కృష్ణారెడ్డి, షేక్ అఫ్జల్, షేక్ రహమత్ నవాజ్, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

## 108 వాహనాల్లోను పాముకాటు, వడదెబ్బకు చికిత్స



**కోట, జూన్ 11 ప్రభాతవార్త :** ప్రాణాపాయ స్థితిలో ఉండే బాధితులకు 108 వాహనాల ద్వారా మరింత మెరుగైన సేవలందేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాలను క్రమంగా మెరుగుపరుస్తోంది. ప్రస్తుతం ఎండతీవ్రత కారణంగా వడదెబ్బకు గురై ప్రాణాపాయా స్థితికి చేరుకున్న వారికి తక్షణమే ఉపశమనం కలిగించేందుకు, పొలాల్లో పాముకాటుకు గురైన వారి ప్రాణాలను కాపాడేందుకు కావాల్సిన మందులను, కిట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో వడదెబ్బ, పాముకాటుకు గురైన బాధితులకు 108 వాహనాల్లోనే ఊపిరి పోయనున్నారు. జిల్లాలో సుమారు 40 అంబులెన్స్ వాహనాలు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 150 నుంచి 200 మంది గాయపడిన క్షతగాత్రులు, గుండెజబ్బు బాధితులు, ప్రసవాల కోసం వెళ్లే గర్భిణులు, వివిధ రకాల వ్యాధిగ్రస్తులు సేవలు పొందుతున్నారు. దీంతో పాటు అదనంగా వడదెబ్బ, పాముకాటు బాధితులకు వైద్యుల సూచనలు, సలహాలతో 108 వాహన సిబ్బంది వైద్యసేవలు అందించనున్నారు. తాజాగా ఐస్‌ప్యాక్‌లు, పొలాల్లో పాముకాటుకు గురైనప్పటికీ ప్రాణాలు నిలిపే యాంటీ స్నాక్స్‌వెనం ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచారు. ఇలా అందిస్తారు సేవలు పాముకాటుకు గురైన బాధితుడి వద్దకు 108 వాహనం చేరుకుని వీడియో కాల్ ద్వారా వైద్యుల సలహాలు, సూచనల మేరకు ఏఎస్‌వి ఇంజక్షన్‌ను సెలైన్ బాటిల్‌లో కలిపి బాధితుడికి సిబ్బంది ఎక్కిస్తారు. అదేవిధంగా వడదెబ్బకు గురైన బాధితుడికి ఇఎంటి సమన్వయంతో చేసుకుంటూ ఐక్‌ప్యాక్‌లను టవల్‌లో వేసి బాధిత వ్యక్తి శరీరంలో వేడిని దూరం చేసి చల్లదనం వచ్చేలా చర్యలు చేపడతారు. అవసరమైతే సెలైన్ ఎక్కిస్తారు. లేనిపక్షంలో అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి వైద్యసేవలు అందించి ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తారు.

## సంగంలో టిడిపి సమావేశం



**సంగం జూన్ 11 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సంగంలోని ఇరిగేషన్ బంగ్లా వద్ద మండల పార్టీ అద్యక్షులు బాణా శ్రీనివా సులురెడ్డి అధ్యక్షతన టిడిపి మండల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల పార్టీ టిడిపి అద్యక్షులు బాణా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాలోకేష్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. ప్రతి గ్రామంలో సమస్యలు గురించి తెలియజేస్తే వాటిని మంత్రి దృష్టికి తీసుకొని వెళతానని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, గుళ్ళ పల్లి శ్రీనివాస్‌యాదవ్, బాబు, మెట్టు విజయకృష్ణారెడ్డి, మండలంలోని అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## సంస్థను లాభాల బాటలో నడిపేందుకు సహకరించాలి

### జిల్లా ప్రజా రవాణా అధికారి షమీమ్



**రాపూరు, జూన్ 11, ప్రభాతవార్త :** ఆర్టీసిని లాభాల బాటలో నడిపేందుకు సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని నెల్లూరు జిల్లా ప్రజా రవాణా అధికారి(ఆర్టీసి రిజనల్ మేనేజర్) షమీమ్ కోరారు. గురువారం ఆమె రాపూరు ఆర్టీసి డిపోను, గ్యారెజ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు త్వరలో కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నట్లు తెలిపారు. ఆర్టీసిని లాభాల బాటలో నడిపేందుకు సిబ్బంది సహకరించాలన్నారు. బస్సులలో ప్రయాణించే ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్‌లు స్నేహపూర్వకంగా, మర్యాదపూర్వకంగా మసులుకోవాలన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా వారికి సహకరించాలన్నారు. ప్రయాణికులను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా వుండాలని కోరారు. అంతకు ముందు ఆమె ఆర్టీసి గ్యారేజ్‌ను తనిఖీ చేసి బస్సుల కండిషన్లు ఎలా వున్నాయి. వాటికి కావలసిన అన్ని స్పేర్ పార్ట్స్ వున్నాయా లేదా అని ఆరా తీశారు. బస్సులను పూర్తి స్థాయిలో కండిషన్‌గా వుండేలా చూడాల్సిన భాద్యత గ్యారెజ్ సిబ్బందిపై వుందని ఆమె తెలిపారు. ఇమె వెంట డియం అనీల్ కుమార్ పలువురు సిబ్బంది వున్నారు.

## నేడు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తనిఖీలు

**బిట్రగుంట జూన్ 11 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ శుక్రవారం సాలుసరి తనిఖీల్లో భాగంగా విజయవాడ రైల్వే డివిజన్ లో పర్యటించనున్నారు. ఈ మేరకు అధికారికంగా ఆయన టూర్ షెడ్యూల్ ప్రోగ్రాం ఖరారైంది. అందులో భాగంగా బిట్రగుంట రైల్వే స్టేషన్ లో పలు కార్యాలయాలతో పాటు ఎల్ సి గేట్ల పర్యవేక్షణ, రైల్వే ట్రాక్ పటిష్ఠత, సిబ్బంది పనితీరును కూడా ఆయన పర్యవేక్షించనున్నారు. డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లు మినహా మిగిలిన రైల్వే స్టేషన్ అన్నింటిని ఇండోర్ ఇన్స్పెక్షన్ చేయనున్నారు.

## మనబడి మన పండుగ కార్యక్రమాన్ని నిర్వహించాలి



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** పాఠశాలలు శుక్రవారం నుండి పున:ప్రారంభం కానున్న దృష్ట్యా మనబడి మన పండుగ పేరుతో ప్రెషర్స్‌డే కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠవాలలో ఘనంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారులు బండి గోవిందయ్య సిహెచ్ వెంకటసుబ్బయ్యలు గురువారం పేర్కొన్నారు. నూతన విద్యార్థులకు ఫ్లవర్ ఇచ్చి స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులను తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలను గురువారంకు అన్ని పాఠశాలలకు చేరవేసే పనిలో ఉన్నట్లు తెలిపారు. పాఠశాలోని గదులను, అవరణాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదులు, కార్యాలయ గదులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని పలువురు సిఆర్ఎంటిలు పాల్గొన్నారు.

## ఊటుకూరులో రెండవ గ్రామసభ



**విడవలూరు, జూన్11 ప్రభాతవార్త:** మండలం పరిధిలోని ఊటుకూరు గ్రామం రెవెన్యూ కార్యాలయంలో "వన్ మంత్ -వన్ విలేజ్-ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా రెండవ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, సమస్యలను నేరుగా తెలుసుకుని తక్షణ పరిష్కారం అందించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తహశీల్దార్ తెలిపారు. గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన ప్రతి అర్జీని సంబంధిత శాఖలతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని, అధికారులు గ్రామాలకు వచ్చి ప్రజలతో నేరుగా మమేకమవడం వల్ల పారదర్శకత పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను ఎలాంటి సంకోచం లేకుండా గ్రామసభల్లో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ అబ్దుల్ సలాం, మండల సర్వేయర్ శ్రీలత, వీఆర్వోలు చంద్రశేఖర్, మస్తాన్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రామతీర్థం ఆలయానికి రూ.18.64 లక్షల ఆదాయం

### రంగులరాట్నం వేలంపాటతో రూ.5.73 లక్షల అదనపు రాబడి



**విడవలూరు, జూన్ 11 ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహ్మో త్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన తాత్కాలిక అంగళ్లు, రంగులరాట్నం వేలంపాట హోరాహోరీగా సాగింది. దేవాలయ కార్యనిర్వాహణ అధికారి బి. మల్లికార్జునరెడ్డి పర్యవేక్షణలో జరిగిన వేలంపాటకు భక్తులు, వ్యాపారుల నుంచి విశేష స్పందన లభించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆలయానికి రూ.5.73 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. మొత్తం ఆదాయం రూ.18.64 లక్షలకు చేరుకుంది. ఇందులో రంగులరాట్నం వేలంపాట ద్వారా రూ.12.47 లక్షలు, టెంకాయల వేలం ద్వారా రూ.1.84 లక్షలు, టెంకాయల చిల్లర విక్రయాల ద్వారా రూ.1.32 లక్షలు, ఇతర మార్గాల ద్వారా రూ.3.01 లక్షల ఆదాయం లభించింది. గత ఏడాది మొత్తం ఆదాయం రూ.12.91 లక్షలు ఉండగా, ఈసారి భక్తుల ఉత్సా హం, వేలంపాటలో పోటీ కారణంగా ఆదాయం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా రంగులరాట్నం వేలంపాట ద్వారానే రూ.4.37 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ అవగాహన సదస్సును విజయవంతం చేయాలి



**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కోవూరులోని రుక్మిణి కళ్యాణ మండపంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగు తుందని, దీనిని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైసీపీ రైతు సంఘం అధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డిలు తెలిపారు. ఈ మేరకు గురువారం వైసీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ మాజీ మంత్రి , వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే వైసీపీ బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సుకు నియోజకవర్గంలోని బీఎల్‌వోలు అందరూ తప్పక పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అనంతరం రుక్మిణి కళ్యాణ మండపం నుంచి కోవూరు బజార్ సెంటర్ వరకు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంపై ర్యాలీ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గురుమూర్తి హాజరవుతారన్నారు. ఈ రెండు కార్యక్రమాలకు బీఎల్‌ఏలు వైసీపీ సీనియర్ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన ఉపయోగకరం



**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులుగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ రీజనల్ మేనేజర్ పీవీ రమణ తెలిపారు. ఈ మేరకు కోవూరు మండలం పడుగుపాడు పరిధిలో ఉన్న బ్యాంక్ ఆవరణంలో గురువారం ఇరువురు ఖాతాదారులు మృతిచెం దడంతో నామినీలకు ఒక్కొక్కరికీ 2 లక్షల మేర చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులో ఖాతాదారులైన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి 436 రూపాయలు చెల్లిస్తే సాధారణ మృతికి 2 లక్షల రూపాయలు ఇన్సూరెన్స్ వస్తుందన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని ఖాతాదారులు అంగీకారంతో పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే తమ బ్యాంకులో ఎంతో మంది ఖాతాదారులకు ఈ పథకం కింద నగదు వారి వారి ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందకోరే ఖాతాదారులు 18 నుంచి 50 సంవత్సరాల లోపు వారు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ఇప్పటికే ఈ పథకంపై తమ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు అవగాహన కల్పించడం జరిగిందని పడుగుపాడు ఏపీజీబీ మేనేజర్ ఎంవీ చరణ్‌కుమార్ తెలిపారు. అనంతరం నామినీలకు చెక్కులను పంపిణీ చేశారు. ఏపీజీబీలో ఖాతాదారులైన నిమ్మకాయల రమణమ్మ ఇటీవల గుండెపోటుతో మృతిచెందడంతో నామినీగా ఉన్న కుమార్తె శ్రీదేవికి 2 లక్షల చెక్కును, అదేవిధంగా ఎం. శివకుమార్ ఇదే బ్యాంకులో ఖాతా ఉంది. అతను కూడా ఇటీవల మృతిచెందడంతో నామినీగా ఉన్న తండ్రి మల్లికార్జునకు 2 లక్షల చెక్కును ఆర్ఎం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జి. సుధీర్, క్యాషియర్ ఎస్కే లిఖియాత్ ఆలీ, కె. సాయి, తదితరులు ఉన్నారు.

## ఎస్ఐఆర్‌పై బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నేడు



**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై శుక్రవారం కోవూరు తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఎస్ఐఆర్‌పై ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన బూత్ లెవల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ఇందులో వారు పాల్గొని అవగాహన చేసుకోవాలన్నారు.

## ఏ.పి.జి.బిలో పి.యం.జె.జె.బి.వై చెక్కు పంపిణీ




**రాపూరు, జూన్ 11, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో గురువారం ప్రధానమంత్రి జివన్ జ్యోతి బీమా యోజన చెక్కును సంబందిత లబ్ధిదారునికి అందజేశారు. బ్యాంకులో ఖాతాదా రుంలైన ఎస్.కె మమోలా ఇటీవల మృతి చెందారు. మృతురాలికి బ్యాంకులో బీమా వుండటంతో భీమా మొత్తాని భీమా నామిని అయిన ఎస్.కె గౌష్ బాషాకు బ్యాంకు మేనేజర్ కె. శ్రీనివాసులు, క్యాషియర్ యం.మహేష్‌లు ఆందజేశారు. ఖాతాదారులకు అనేక రకమైన సేవలు అందిస్తున్న తమ బ్యాంకు సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

## కావలి ఆర్డీఓని మర్యాదపూర్వకంగా కలిసిన వంటేరు



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** కావలి రెవెన్యూ డివిజనల్ అధికారి ఎలీషాను గురువారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం కావలి డివిజన్‌లోని పలు విషయాలను చర్చించడం జరిగింది.

## కొత్త బంగారు లోకానికి సమస్యల స్వాగతం

### - నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం



**కోట, జూన్ 11 ప్రభాతవార్త** వేసవి సెలవులు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి ప్రభుత్వ బడులు పునః ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సమస్యలు స్వాగతంపలుకుతున్నాయి. పనిచేయని తాగునీటిప్లాంట్లు, తిరగని ఫ్యాన్లు, విరిగిన బల్లలు, అందుబాటులోకి రాని తరగతి గదులు వెక్కిరిస్తున్నాయి. ఇసుక, కంకర, మట్టిగుట్టలు భయపెడుతున్నాయి. కోట మండలంలోని చెందోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ 10 తరగతుల వరకు నిర్వహించాల్సి ఉండగా, ఇంకా భవనాలు పూర్తి కాలేదు. గత వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. సర్కారు బడుల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. కోట బిసి గురుకుల పాఠశాలలో 640 మంది విద్యార్థులు ఉన్నాయి. 220 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు 17 మంది బోధిస్తుండగా, గెస్ట్ టీచర్లు 19 మంది ఉన్నారు. ఇక్కడ ల్యాబ్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. గతంలో నాబార్డు కింద నిర్మించిన భవనాలు కూడా అసంపూర్తిగా వదిలేశారు. ప్రభుత్వం త్వరితగతిన భవనాలకు నిధులు మంజూరు చేసి పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

## గవర్నర్ చేతుల మీదుగా విశ్వనాథ్‌కు పీహెచ్‌డీ ప్రధానం




**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** వైఎస్ ఆర్ కడప జిల్లా, ఖాజీపేట మండలం, పుల్లూరు గ్రామానికి చెందిన మీసాల విశ్వనాథ్ కామర్స్ విభాగంలో ప్రొఫెసర్ ఎం.చంద్రయ్య మార్గదర్శకత్వంలో ఈ పరిశోదనను పూర్తి చేసి ప్రతిష్టాత్మక పీహెచ్‌డి డీగ్రీ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా స్వీకరించడం జరిగింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలిలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ కళాశాల కామర్స్ విభాగం ద్వారా ఆయన ఈ పరిశోదన పూర్తి చేశారు. పుల్లూరు గ్రామానికి చెందిన మీసాల వెంకటసుబ్బయ్య, అమ్మణ్ని దంపతుల కుమారుడైన విశ్వనాథ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఇన్‌వైఎస్ఆర్ కడప జిల్లా ఆఫ్ ఏపి అనే అంశంపై సుదీర్ఘ పరిశోదన చేశారు. తమ సొంత జిల్లాలోని పరిశ్రమల ఆర్తిక, వ్యాపార స్థితిగతులపై ఆయన చేసిన పరిశోదన ఎంతో ఉత్తమమైనదిగా గుర్తింపు పొందింది. గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పటాట అందుకొని గ్రామానికి, జిల్లాకు పేరు తెచ్చిన ఆయనను గ్రామ ప్రజలు, విద్యావేత్తలు, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ అధ్యాపకులు, మిత్రులు ఘనంగా అభినందించారు.

## సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

### బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ ఏ. లక్ష్మీ ప్రసన్న



**విడవలూరు, జూన్ 11 ప్రభాతవార్త:** విడవలూరు మండల తహశీల్దారుగా ఏ.లక్ష్మీ ప్రసన్న గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల ప్రజలకు పారదర్శకంగా, జాప్యం లేకుండా రెవెన్యూ సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సకాలంలో పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రభుత్వ సేవలు అర్హులందరికీ చేరేలా కృషి చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందిస్తానని పేర్కొన్నారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి




**కోవూరు, జూన్ 11 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని నెలలో నాలుగు పర్యాయాలు ఎంపిక చేసిన గ్రామంలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని,దీనిని ఆ గ్రామంలోని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు.మండలం పోతిరెడ్డిపాలెం గ్రామం లోని సచివాలయంలో గురువారం నిర్వమించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి మంచి అవకాశాన్ని రైతులు, గ్రామస్తులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నరు. ఏమైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వకంగా అర్జీలు ఇస్తే దానిని పరిశీలించి పరిష్క రించేలా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 6 అర్జీలు స్వీకరించడం జరిగింది. అందులో నాలుగు అర్జీలు సర్వే కొరకు, 2 అర్జీలు అడంగల్‌లో పేర్లు నమోదు కోసం వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, ఆర్ఐ చాణక్య, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, రైతులు ఉన్నారు.

## పదవిని బాధ్యతగా భావించాలి : మంత్రి నారాయణ

### - మూలాపేట ధర్మరాజు స్వామి ఆలయ నూతన ట్రస్ట్ బోర్డు అభినందన సభలో పాల్గొన్న మంత్రి నారాయణ
### - ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది
### - మూలాపేట ఆలయ ధ్వజస్తంభ పునరుద్ధరణకు మంత్రి నారాయణ గ్రీన్ సిగ్నల్
### - సమతుల్యతతోనే 11 మందితో నూతన ఆలయ కమిటీ ఏర్పాటు
### దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి ఆలయ అభివృద్ధికి నిధులు తెస్తా మంత్రి నారాయణ హామీ
### - భక్తులకు ఇబ్బంది లేకుండా సేవలు అందించి పదవులకు వన్నె తేవాలి
### - నూతన కమిటీకి మంత్రి నారాయణ దిశా నిర్దేశం



**నెల్లూరు,జూన్11 ప్రభాతవార్త-విద్య** నెల్లూరు సిటీ నియోజకవర్గం మూలాపేటలోని శ్రీ కృష్ణధర్మరాజు స్వామిఆలయ నూతన ట్రస్ట్ బోర్డు అభినందన సభలో రాష్ట్ర పురపాలక పట్టణా భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరునారా యణ పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం వద్ద భారీగా బాణసంచా కాల్చి, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో సాంప్రదాయబద్దంగా మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి నారాయణకి అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, నాయీ బ్రాహ్మణ, బ్రాహ్మణ వర్గాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ, అన్ని వర్గాల సమతుల్యతతో ఈ 11 మంది నూతన పాలక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఎంతో పురాతనమైన ఈ ఆలయంలో ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే బ్రహ్మోత్సవాలను 21 రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారన్నారు. టెంపుల్ ట్రస్ట్ బోర్డు పదవి ఎంతో గౌరవప్రదమైనదని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఈ పదవులకు వన్నె తేవాలని కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇప్పటికే ఎన్నో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని, ఈ ఆలయ అభివృద్ధికి కూడా పాలక మండలి అంతా చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే తాను స్వయంగా ఆనం రామనారాయణ రెడ్డితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ధ్వజస్తంభం పునరుద్ధరణ ప్రతిపాదనపై సానుకూలంగా స్పందిస్తూ, దెబ్బతిన్న ధ్వజస్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి వెంటనే నివేదిక సిద్ధం చేయాలని అక్కడే ఉన్న ఈఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాలక మండలి సభ్యులు వేలూరు పెంచల్ రాజా (చైర్మన్), అగ్నిహోత్రం వినోద్ కుమార్, ముంగమూరు సాయి విజయ్ కుమార్, కనగలూరు సురేష్, నారాయణ బాలసుబ్రహ్మణ్యం, దాంపూరు ప్రసన్న కుమార్, వీము అమ్మణ్ణి, చిత్తుటూరు వెంకట పద్మావతి, వాసుదేవ భాగ్యలక్ష్మి, కలివేటి కామాక్షి, అరవ అమృతం తదితరులను మంత్రి నారాయణ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నారాయణ విద్యాసమస్థల జీఎం వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటిసి విజేతా రెడ్డి, డివిజన్ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## 15 నిమిషాలకే ముగిసిన అభివృద్ధి సమీక్ష



**విడవలూరు, జూన్ 11 ప్రభాతవార్త:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యా లయంలో డిప్యూటీ సీఈఓ బ్రహ్మ య్య గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులతో సమీక్ష సమా వేశం నిర్వహించారు. సమావేశం ప్రా రంభంలో కొంతసేపు వ్యక్తిగత విషయాలను ప్రస్తావించిన ఆయన, అనంతరం అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సంక్షిప్తంగా సమీక్ష నిర్వ హించి, కేవలం 15 నిమిషాల్లోనే సమావేశాన్ని ముగించారు. తదుపరి అన్నారెడ్డిపాలెంలో స్వచ్ఛ రథం పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి , గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్‌కు పాతర : బదిలీ అధికారిపైనే రెవెన్యూ అభిమానం!

### - విడవలూరులో పాత బ్యానర్లే.. కొత్త ఆర్డీవోకు చోటేదీ?




**విడవలూరు, జూన్ 11 ప్రభాతవార్త:** ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించాల్సిన రెవెన్యూ అధికారులు, విడవలూరు మండలంలో మాత్రం పాత బ్యానర్లతోనే కార్యక్రమాలు నిర్వహించడం విమర్శలకు దారితీస్తోంది. రెండు నెలల క్రితమే బాధ్యతలు చేపట్టిన ప్రస్తుత ఆర్డీవో డి.ఎలీషా చిత్రానికి చోటివ్వకుండా, బదిలీపై వెళ్లిన మాజీ ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ ఫోటోతోనే "వన్ మంత్-వన్ విలేజ్-ఫోర్ విజిట్స్ కార్యక్రమాల బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు.

**మారిన అధికారులు.. మారని బ్యానర్లు!** మాజీ ఆర్డీవో బదిలీ అయినప్పటికీ మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికీ అదే బ్యానర్లనువినియోగిస్తున్నారు. గురువారం ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ ఏ.లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నప్పటికీ, బ్యానర్పై ప్రస్తుత ఆర్డీవో చిత్రం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

**అభిమానమా.. అవమానమా..?** కొత్త ఆర్డీవో బాధ్యతలు చేపట్టి రెండు నెలలు గడిచినా పాత అధికారి ఫోటోనే కొనసాగించడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మండలవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో ఇది రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యమా, లేక ప్రోటోకాల్ పట్ల నిరాసక్తతా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత అధికారుల వివరాలతో బ్యానర్లు ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రైతులంటే ముఖ్యమంత్రికి చిన్నచూపే

### - యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు



**కోవూరు,జూన్ 11 ప్రభాతవార్త :** ఆది నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చిన్న చూపేనని ప్రస్తుతం ఈ సీజన్‌లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారని, వెంటనే వారికి యూరియా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలనిజిల్లా వైసీపీ అధ్యక్షుడు నరసింహులురెడ్డి డిమాండ్ చేశారు. కోవూరులోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరాకు యూరియా మూడు బస్తాలు ఇస్తానని చెప్పారని, కానీ మరలా ఇప్పుడు యాప్ ప్రవేశపెట్టి రైతులను ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సబబన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి మునుపే యూరియా ఇవ్వము అని చెబితే అసలు పంటలు వేసే వాళ్లము కాదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం యూరియాపై పునరాలోచించి యాప్‌ను తొలగించి ప్రతి రైతుకు ఎకరాకు మూడు బస్తాలు ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒకవైపు రైతుల సంక్షేమానికి తాము బాటలు వేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా వాస్తవ రూపంలో అవి అమలుకు నోచుకోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించి వెంటనే సీజన్‌లో వ్యవసాయం చేసే రైతులకు యూరియా అందించాలన్నారు. రైతులకు యూరియా సకాలంలో అందకపోతే పంట నష్టం జరిగే పరిస్థితి వస్తుందన్నారు. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయాధికారులు దీనిపై స్పందించి రైతులసంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని యూరియాను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నీలపరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మహేష్, సుధీర్‌రెడ్డి, ఉన్నారు.

## దళితవాడ ప్రజలకు ఎమ్మెల్యే క్షమాపణ

### - రూ.74 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**నెల్లూరు రూరల్, జూన్11 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్, కనుపర్తిపాడు కనుపర్తిపాడు దళితవాడ ప్రజలకు మనస్పూర్తిగా క్షమాపణ చెబుతున్నాను. నెల్లూరు రూరల్లో వాడవాడలా అభివృద్ధి పనులు జరుగుతున్నప్పటికీ, గత రెండేళ్లలో ఈ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా అభివృద్ధి నిధులు ఖర్చు చేయలేకపోయాం" అని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం 24వ డివిజన్ పరిధిలోని కనుపర్తిపాడు దళితవాడలో రూ.74లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జనసేన వీరమహిళలు కోలా విజయలక్ష్మి, నందిని యాదవ్లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు లేని సమయంలో రాజకీయ జెండాలు, అజెండాలు పక్కనపెట్టి అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. మహిళల భాగస్వామ్యం లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్న శ్రీధర్ రెడ్డి, రాబోయే 60 రోజుల పాటు నియోజకవర్గంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంలో కూటమి మహిళా నేతలను ముఖ్య అతిథులుగా ఆహ్వానిస్తామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా మహిళలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా వారికి మరింత ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. మహిళా సాధికారత విషయంలో యువనేత నారా లోకేష్ చూపుతున్న దార్శనికత దేశ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కొనియాడారు. మహిళా రిజర్వేషన్లు అమలులోకి వచ్చినా రాకపోయినా ఆంధ్రప్రదేశ్లో 33 శాతం అవకాశాలు కల్పిస్తామని లోకేష్ ప్రకటించడం మహిళల పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.700 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి డివిజన్కు సమాన ప్రాధాన్యత ఇస్తూ మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, భారీ సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15లోపు ఎస్సీ, ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పనులు పూర్తి చేయాలి : మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు, జూన్ 11, ప్రభాతవార్త - వైద్యం** ఆగస్టు 15 లోపు ఎస్సీ, ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పనులు పూర్తి చేయాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. గురువారం ఎస్సీ, ఎస్టీ ఉచిత సోలార్ విద్యుత్ పథకం అమలు తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రంని పథకం కింద ఇప్పటివరకు ఎంతమంది లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ వ్యవస్థలు ఏర్పాటు చేశారో అడిగి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో సోలార్ వెండర్ ఎన్విరాన్ కంపెనీ ప్రతినిధి రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. పథకం అమలు వేగవంతం చేయడానికి సోలార్ వెండర్లకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశిస్తూ, ఆగస్టు 15వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ పథకంపై సమీక్ష నిర్వహిస్తున్నారని, ఇది రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ప్రయోజనాలను పొందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. పథకం అమలులో ఎలాంటి జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేసి ప్రతి అర్హ లబ్ధిదారునికి ఉచిత సోలార్ విద్యుత్ సదుపాయం అందిం చాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నెల్లూరు నగర విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృ ద్ధిపై కూడా మంత్రి సమీక్ష నిర్వహించారు. రాజేంద్రనగర్ 132 కేవీ సబ్‌స్టేషన్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రస్తుతం ట్రాన్స్‌మిషన్ టవర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి త్వరలోనే నెల్లూరు టౌన్ విద్యుత్ వ్యవస్థకు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే గాంధీ బొమ్మ సమీపంలో నిర్మాణంలో ఉన్న కంటైనర్ సబ్‌స్టేషన్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మరో మూడు నెలల్లో 132 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న సోలార్ విద్యుత్ పనుల పురోగతిపై మంత్రి సమగ్రంగా సమీక్షించి, నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. రాఘవేంద్రం, నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, డీఈఈ సునీల్, ఏఈ మునిశేఖర్, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.






## కొత్త యాప్ విధానంపై సంగంలో రైతుల నిరసన

### మద్దతు తెలిపిన వైసిపి నేత కంటాబత్తిన రఘునాదరెడ్డి



**సంగం జూన్ 11 ప్రభాతవార్త** యూరియాకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ విధానం మంచిదికాదని సంగంలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.దీనికి వైసిపి నాయకులు కంఠాబత్తిన రఘునాదరెడ్డి మద్దతు పలికారు. రఘునాదరెడ్డి మాట్లాడుతు యాప్ విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని అన్నారు. అసలు ఈయాప్ రైతులకు అవగాహన లేదని అన్నారు. ప్రతి ఒక్క ఏకరాకి కనీసం 4 బస్తాలు అయినా యూరియా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. తహసిల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వైసిపినాయకులు,రైతులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతిలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయండి : ఎమ్మెల్యే



**గూడూరు, జూన్ 11, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల విజయోత్సవ బహిరంగ సభకు గూడూరు నియోజకవర్గ జన సమీకరణ అబ్జర్వర్ చీరాల ఎమ్మెల్యే ముద్దులూరి మాలకొండయ్య విచ్చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో జన సమీకరణ సభ విజయవంతం పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో 12వ తేదీ టిడిపి విజయోత్సవ బహిరంగ సభ ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. గూడూరు నియోజకవర్గం నుండి ముఖ్య నాయకులు బూత్ ఇంచార్జిలు అనుబంధ సంఘ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. పార్టీ కార్యక్రమాలను నియోజకవర్గంలో దిగ్విజయంగా పూర్తి చేస్తున్నామని ఇదే ఉత్సాహంతో పార్టీని మరింత పటిష్టం చేయాలని కోరారు. అనంతరం అబ్జర్వర్ చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ బహిరంగ సభ విజయవంతంకు నియోజకవర్గానికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించి విజయం సాధించేలా నాయకులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని కోరారు. అదేవిధంగా ప్రజాదర్బార్లో అర్జీలు తీసుకొని సత్వరం పరిష్కరించేందుకు అధికారులకు ఫోన్ల ద్వారా తెలియజేశారు. అదే విధంగా చల్లకూరు మండలంలోని తణుకుమాల గ్రామపంచాయతీ మాజీ సర్పంచి నిరుపాక నారాయనీ తెలుగుదేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో నువ్వు రాశేఖర్ రెడ్డి, లక్ష్మి ప్రసన్న, మట్టం శ్రావణి రెడ్డి, కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, రహీం, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, ముని గిరీష్, మోహన్ రెడ్డి, జలీల్, రాజశేఖర్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

## పామాంజి గోవిందుకు వైద్యసాయం మంజూరు

### రూ.1,60,102ఎల్ఓసి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, జూన్ 11 ప్రభాతవార్త :** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రాధాన్యం అని మరోసారి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చాటి చెప్పారు. ఆర్తిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని నిరుపేదలకు సిఎం సహాయ నిధి ద్వారా చేయూత అందిస్తూ వారి కుటుంబాలకు భరోసా కల్పిస్తూ కావలి రూరల్ మండలం తుమ్మలపెంట గ్రామానికి చెందిన పామాంజి గోవిందు వైద్యచికిత్స కోసం ఆర్తికసాయం అవసరమని తెలుసుకున్న ఎమ్మెల్యే గుంటూరులోని అంజలి మల్టిస్పెషాలిటి ఆసుపత్రి వైద్యుల సూచనల మేరకు రూ.1,60,102 ఎల్ఓసి చెక్కును మంజూరు చేయించి గురువారం టిడిపి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అర్హుత కలిగిన వారు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే చొరవతో వైద్యసాయం అందడంతో పామంజి గోవిందు కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కావలి మండల అధ్యక్షులు ఆవుల రామక్రిష్ణ పాల్గొన్నారు.

## ఎన్‌సిబిసి చైర్ పర్సన్‌ను కలిసిన బొల్లినేని




**వింజమూరు, జూన్ 11, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉ పాధ్యక్షుడు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు బుధవారం ఢిల్లీలోని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్ పర్సన్ సాధ్వి నిరంజన్ జ్యోతిని ఢిల్లీలో ఎన్‌సిబిసి కార్యాలయంలో మ ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొల్లినేని వెంకట రామా రావు ఆంధ్రప్రదేశ్‌లోని వెనకబడిన తరగతుల ప్రజల సమస్యలను చైర్పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా రాష్ట్రంలో బీసీ కులాల సామాజిక ఆర్థిక స్థితిగతులపై తాజా డేటా ఆధారంగా కేంద్రం నుంచి అధరంపూర్ నిధులు మంజూరు చేయాలని కోరారు. బొల్లినేని వినతులను చైర్ పర్సన్ సానుకూలంగా స్పం దించారు. వినతలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బీసీల అభివృద్ధి లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదన్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడు బీసీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బీసీల సమస్యలపై ఎన్సీ బీసీ చైర్పర్సన్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ భేటీలో టిడిపి నేతలు వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సచివాలయం ఎంఎల్‌హెచ్‌పిపై ఫిర్యాదు..

### - విచారణ చేపట్టిన వైద్యాధికారి



**వింజమూరు, జూన్ 11, ప్రభాతవార్త** వింజ మూరు మండలం శంఖవరం గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంఎ ల్‌హెచ్‌పి అఖిలపై గ్రామానికి చెందిన భూ మిరెడ్డి లక్ష్మి దేవి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం వైద్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు. భూమిరెడ్డి లక్ష్మిదేవి తన ఐదేళ్ల మనవడికి వ్యాక్సినేషన్ చేయించేందుకు ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో శంఖవరం సచివాలయానికి వెళ్లారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పి అఖిల, ఎంసిపి (మదర్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్) కార్డు లేకుండా వ్యాక్సిన్ వేయడం సాధ్యం కాదని చెప్పడంతో పాటు తనతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపిస్తూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదు నేపథ్యంలో చాకలకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మురళి తన సిబ్బందితో కలిసి శంఖవరం గ్రామానికి చేరుకుని ఘటనపై విచారణ నిర్వ హించారు. ఫిర్యాదుదారురాలు భూమిరెడ్డి లక్ష్మిదేవితో పాటు సంబంధిత సిబ్బంది వాంగ్మూలాలను నమోదు చేసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మురళి మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి తుది నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని పేర్కొన్నారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్య బోధకుడు కే వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.